డీడబ్ల్యూవోగా లెనీనా బాధ్యతల స్వీకరణ

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : జిల్లా సంక్షేమశాఖ అధికారిగా స్వర్ణలత లెనీనా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా పనిచేసిన విజేత లెనీనాకు బాధ్యతలు అప్పగించారు. లెనీనా గతంలో మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో డీడబ్ల్యూవోగా పనిచేశారు.

షరతులు లేకుండా బోనస్ చెల్లించాలి

మాట్లాడుతున్న లక్కినేని సురేందర్‌రావు

టేకులపల్లి, అక్టోబర్ 16: కోయగూడెం ఉపరితల గనిలో ఓబీ కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా సింగరేణి బోనస్ 5000 అందరికీ చెల్లించాలని జేఏసీ కన్వీనర్ లక్కినేని సురేందర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని కోయగూడెం ఉపరితల గనిలో నిర్వహించిన కార్మికుల జేఏసీ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్మికుడికి బోనస్ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో భూక్యా దళ్‌సింగ్, వీరబ్రహ్మచారి, హర్జ్య, గౌని నాగేశ్వరరావు, యాకూబ్ షావతి, రామ్‌సింగ్, పాయం వెంకన్న, సుందర్ పాల్గొన్నారు.

20న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనసభ

టేకులపల్లి, అక్టోబర్ 16: ఈ నెల 20న హైదరాబాద్‌లో సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) అనుబంధ సంస్థ ఐఎఫ్‌టీయూ విప్లవ కార్మిక సంఘం ఆలిండియా గ్రేడ్ యూనియన్‌లో టీయూసీఐలో ఐఎఫ్టియూ విలీన సభను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు పాయం వెంకన్న కోరారు. బుధవారం మండల కేంద్రం సింగరేణి హైటెక్ కాలనీలో కాంట్రాక్ట్, కార్మికుల మస్టర్ అడ్డా వద్ద మీటింగ్ నిర్వహించారు. జర్పుల సుందర్, నాగమణి, శారద, జ్యోతి, ఎర్రమ్మ, బాలు, సోమ్లా, రవి, సూర్య పాల్గొన్నారు.

ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు

భద్రాచలం, అక్టోబర్ 16: ఆల్ పెన్షనర్స్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్థలం కేటాయింపు జరిగేలా చూస్తామని, హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కేఎస్ఎల్‌వీ ప్రసాద్, డీ కృష్ణమూర్తి, సుబ్బయ్యచౌదరి, రాజబాబు, శివప్రసాద్, ఐలయ్య, రాజు, కాంగ్రెస్ నాయకులు భోగాల శ్రీనివాసరెడ్డి, కొండిశెట్టి కృష్ణమూర్తి, వెంకటరెడ్డి, నవాబ్, రత్నం రమాకాంత్, తిరుపతిరావు, రమేశ్‌గౌడ్, బొంబోతుల రాజీవ్ పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన రేగా

మణుగూరు టౌన్, అక్టోబర్ 16: మణుగూరు బీఆర్ఎస్ నాయకుడు తాళ్లపల్లి యాదగిరి గౌడ్ కుమారుడు రాహుల్ గౌడ్ – అమూల్య వివాహ రిసెప్షన్‌లో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వీడియో కాల్ ద్వారా వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి న్యాయం చేయాలి

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పాల్వంచ, అక్టోబర్ 16 : కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారికి న్యాయం చేయాలని కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచ మండల కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు భట్టు మురళి, మెంటం రాము మాట్లాడుతూ నియోజకవర్గంలో 40వేల సభ్యత్వాలు చేశామన్నారు. కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని పాల్వంచ మండలానికి చెందిన గిరిజనులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరి నాయక్, గణేష్, రాము, బాలు, దేవరాజ్, బీమా, సోమయ్య, సుధాకర్, శ్రీను, నాగరాజు, మనోజ్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పాఠశాలల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: నియామక ప్రతాలను అందజేస్తున్న తహసీల్దార్, బూర్గంపహాడ్‌లో.. అశ్వాపురం: నియామక పత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం, అక్టోబర్ 16: డీఎస్సీ–2024 అభ్యర్థులుగా క్వాలిఫై కావడంతో మండలవ్యాప్తంగా 20 మందికి ఉపాధ్యాయులకు నియామక పత్రాలను తహసీల్దార్ అశోక్‌కుమార్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంఈవో సున్నం సమ్మయ్య ఉపాధ్యాయులందరికీ పేరుపేరునా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో ఏవీ రామారావు, ఏజే ప్రభాకర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

బూర్గంపహాడ్‌లో ఏడుగురు..

బూర్గంపహాడ్, అక్టోబర్ 16: మండలానికి చెందిన ఏడుగురు నూతన ఉపాధ్యాయులకు ఎంఈవో యదు సింహరాజు బుధవారం నియామక పత్రాలు అందజేశారు. పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరారు. వీరందరికీ ఎంఈవో అభినందనలు తెలిపారు.

దమ్మపేట: నియామక పత్రాలు అందిస్తున్న ఎంఈవో లక్ష్మి

అశ్వాపురంలో..

అశ్వాపురం, అక్టోబర్ 16: ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో వీరస్వామి నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీఆర్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు అభినందనలు తెలిపారు.

అశ్వారావుపేట 55మంది..

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 16: మండలంలో 48 మంది ఎస్‌జీటీ, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు నూతనంగా విధుల్లో చేరారని ఎంఈవో ప్రసాదరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీలో అభ్యర్థుల జాయినింగ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు టీ వీరేశ్వరరావు, వెంకయ్య, సీఆర్‌పీలు ఉన్నారు.

దమ్మపేటలో 28మంది

దమ్మపేట, అక్టోబర్ 16: నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన 28 మందికి ఎంఈవో కీసరి లక్ష్మి బుధవారం నియామక పత్రాలు అందించి విధులు కేటాయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, నూతన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల ఆందోళన

బంకు ఎదురుగా ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్లు

పాల్వంచ, అక్టోబర్ 16 : పాత పాల్వంచ సీఎన్‌జీ బంకులో గ్యాస్ సక్రమంగా పంపిణీ చేయాలని కోరుతూ బుధవారం జాతీయ రహదారిపై ఆటోడ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. ప్రతిరోజు వందల సంఖ్యలో ఆటోలు, ఇతర వాహనాలు సీఎన్జీ గ్యాస్ కోసం బంకుకొస్తే అయిపోయిందని చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటకుపైగా రోడ్డుపై ఆందోళన చేశారు. దీంతో జాతీయ రహదారికి రెండువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పాల్వంచ పోలీసులు అక్కడికి చేరుకొని బంక్ యజమానులతో మాట్లాడి ఆటోడ్రైవర్‌కు సర్దిచేసి చెప్పారు. దీంతో ఆందోళన విరమించారు.

విలీన ప్రకటనకు సంబంధం లేదు

మాట్లాడుతున్న సీతారామయ్య

ఇల్లెందు, అక్టోబర్ 16: భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూను టీయూసీఐలో విలీన ప్రకటనకు మాతృ సంస్థలకు సంబంధం లేదు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సీతారామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి స్పష్టం చేశారు. బుధవారం ఇల్లెందు ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు ఐఎఫ్‌టీయూల సంయుక్త సమావేశంలో వారు మాట్లాడారు. టీయుసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన ప్రకటన ఐఎఫ్‌టీయూ శ్రేణులను, కార్మిక వర్గాన్ని గందరగోళానికి గురి చేస్తుందని, ఈ ప్రక్రియ విప్లవ కార్మిక సంఘమైన ఐఎఫ్‌టీయూ జాతీయ, రాష్ట్ర కమిటీకి కానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తోడేటి నాగేశ్వరరావు, ఎం.డీ రాసుద్దీన్, డి.ప్రసాద్, గౌని నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్, మోహన్ రావు, తొగర సామెల్ పాల్గొన్నారు.

అమ్మవారి ఊరేగింపు

అమ్మవారి విగ్రహాలను ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 16: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు అనంతరం అమ్మవారిని పట్టణ శివారులోని వెంకమ్మ చెరువులో నిమజ్జనం చేశారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు

అశ్వాపురం, అక్టోబర్ 16: ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక కమిటీ వేసి గ్రామాల్లో సభలు నిర్వహించి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారని కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇళ్ల కోసం పార్టీ సభ్యుల పేర్లు రాసుకుంటున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆరోపించారు. బుధవారం అశ్వాపురంలో ఆయన మాట్లాడారు. కమిటీలను ఎమ్మెల్యేల పర్యవేక్షణలోనే పెడుతున్నారని, ప్రజాపాలన ప్రభుత్వం పేదవారికి ఇళ్లు ఇచ్చే పరిస్థితిలేదని అన్నారు. జీవోలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, డ్వాక్రా సభ్యులను ఇద్దరిని పెట్టాలని ఉండగా అలాంటి నియమాలు పాటించకుండానే కమిటీలు ఏర్పాటు చేశారు ఆరోపించారు. అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందజేసే వరకు పేదల పక్షాన కలిసి వచ్చే పార్టీలతో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

తాలిపేరు సెకండ్ జోన్‌కి నీళ్లు ఇవ్వాలి

మాట్లాడుతున్న వంశీకృష్ణ

పర్ణశాల, అక్టోబర్ 16: ఈ ఏడాది తాలిపేరు సెకండ్ జోన్‌కి నీళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పెద్దనల్లబెల్లిలో మట్టా ముద్దరాజు అధ్యక్షతన జరిగిన గ్రా శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ సారి తాలిపేరు నీళ్లు సెకండ్ జోన్‌కి ఇవ్వాలని అధికారులను కోరారు. మరమ్మతుల పనులు ఏవైనా ఉంటే అవి మార్చి 15 తర్వాత చేయాలని, రైతాంగం ఇబ్బంది పడకుండా నీళ్లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మర్మం చంద్రయ్య, గోవర్ధన్, యాకూబ్ రెడ్డి, కొన్నె రాములు, నర్సింహారావు, రాంమూర్తి, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ఆళ్లపల్లి, అక్టోబర్ 16: గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, పరిశుభ్యం తదితర సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని బోడాయికుంట, నడిమిగూడెం పంచాయతీల్లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో పంచాయతీల కార్యదర్శులు పని తీరు ఏం బాగలేదని కార్యదర్శులు పనితీరు మార్చుకోవాలని అన్నారు. నాలుగు రోజుల్లో ప్రతి ఇంటికి తాగునీరు, పరిశుభ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం దసరా సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోగా క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం రాయిగూడెం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శకుంతల, ఎంపీడీవో శ్రీను, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ విజయకుమారి, డాక్టర్ సంఘమిత్ర, వివిధ శాఖల ఏఈలు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మృతులకు ఎమ్మెల్యే పాయం నివాళి

బూర్గంపహాడ్, అక్టోబర్ 16: మండలంలోని బుడ్డగూడెం గ్రామానికి చెందిన సోడె సారయ్య, సోడె నరేశ్ మంగళవారం రాత్రి పాల్వంచ ఇందిరానగర్ కాలనీ వద్ద ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం బుడ్డగూడెం చేరుకుని సారయ్య, నరేశ్ భౌతికకాయాలను సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. నివాళి అర్పించిన వారిలో నాయకులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మహమూద్‌ఖాన్, కణితి కృష్ణ, కైపు లక్ష్మీ నారాయణరెడ్డి, కాటం వెంకటరామిరెడ్డి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

సొసైటీ నిబంధనల ప్రకారమే ముందుకెళ్తున్నాం..

టేకులపల్లి, అక్టోబర్ 16: బేతంపూడి మత్స్య సొసైటీపై రోళ్లపాడు గ్రామానికి చెందిన పలువురు చేసిన ఆరోపణల్లో నిజం లేదు అని, సొసైటీ నిబంధనల ప్రకారమే ముందుకు సాగుతున్నామని మత్స్య సొసైటీ అధ్యక్షుడు చీమల రామయ్య పేర్కొన్నారు. బుధవారం టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో కమిటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. బేతంపూడి మత్స్యశాఖ సొసైటీపై చేసిన ఆరోపణల్లో నిజం లేదు అని, అర్హత ఉండి కూడా సొసైటీలో చేరకుండా బయట ఉండి సొసైటీపై బురదచల్లడం సరికాదని అన్నారు. వారు చేసిన ఆరోపణలను రుజువు చేసి సొసైటీలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు చీమల బాబు, సుధీర్, సభ్యులు ఈసం వీరబాబు, చీమల పాపారావు, పూనెం శివకృష్ణ, భూక్యా భద్రు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు కుమ్రం భీమ్ పోరాటాలే స్ఫూర్తి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 16: ఆదివాసీ బిడ్డలకు కుమ్రం భీమ్ పోరాటాలే స్ఫూర్తిదాయకమని తుడుం దెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాటి మధు అన్నారు. బుధవారం మండలంలోని చల్లసముద్రం పంచాయతీ ఒడ్డుగూడెంలో ఈ నెల 16 నుంచి 23 వరకు నిర్వహించే కుమ్రం భీమ్ వర్ధంతి కరపత్రాన్ని విడుదల ఆయన ఆవిష్కరించారు. గిరిజన హక్కులు సాధించుకోవాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుమ్మడి రామ్‌కుమార్, చీమల సాగర్, ఈసం వీరన్న, తాటి అశోక్, జోగా భద్రయ్య, ఈసం వెంకటేష్, పినబోయిన మధు, జోగ సందీప్, ఈసం అరవింద్, సూర్నపాక జంపన్న, తాటి మణిదీప్, ఈసం సాయి తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, అక్టోబర్ 16: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల నిత్యకల్యాణాన్ని అర్చకులు బుధవారం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర పూజలను జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

19న దిశ కమిటీ సమావేశం

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : ఐడీవోసీ కార్యాలయంలో ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు దిశ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి కో చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, దిశ కమిటీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తమ శాఖల్లో చేపడుతున్న పనులపై పూర్తి నివేదికలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 16 : 2024 –25 విద్యాసంవత్సరంలో విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి.అనసూయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 29వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈ పథకం ద్వారా యూఎస్ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్‌కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో విద్యను అభ్యసించవచ్చని తెలిపారు.

వినాయకపురంలో శబరి స్మృతి యాత్ర

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 16: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం వద్ద గురువారం శబరి స్మృతి యాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సూర్యప్రకాశరావు తెలిపారు. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు ప్రచార రథంతో శోభాయాత్ర వినాయకపురం నుంచి చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం వరకు, 10.30 నుంచి 12.30 గంటల వరకు ముత్యాలమ్మ ఆలయం వద్ద భద్రాచల శ్రీస్వామి వారి ప్రచార మూర్తుల కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ ఈవో ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు వాల్మీకి జయంతి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 16 : జిల్లాలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఈ నెల 17వ తేదీ గురువారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించే కార్యక్రమానికి వాల్మీకి బోయలు హాజరుకావాలని కోరారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

పాల్వంచ రూరల్, అక్టోబర్ 16 : సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సొసైటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పాలకవర్గం పని చేస్తున్నదని అన్నారు. వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు నారాయణరావు, పాపారావు, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం

భద్రాచలం/బూర్గంపహాడ్, అక్టోబర్ 16: ఎటపాక 132 కేవీ సబ్ స్టేషన్‌కు వచ్చే విద్యుత్‌లైన్ మరమ్మతుల్లో భాగంగా భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపహాడ్ మండలాలకు గురువారం ఉదయం 10నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో (అప్‌అండ్ డౌన్) స్వల్ప అంతరాయం ఏర్పడుతుందని భద్రాచలం ట్రాన్స్‌కో డీఈ జీవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అశ్వారావుపేట, అక్టోబర్ 16: విద్యుత్ మరమ్మతుల కారణంగా వినాయకపురం, గంగారం, నారాయణపురం సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని డిస్కం ఏఈ సంతోశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 16 : హోంవర్క్ పూర్తి చేయలేదని విద్యార్థిని ప్రైవేట్ ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన బుధవారం కొత్తగూడెం పట్టణంలో చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని ప్రగతినగర్‌లో గల మానస వికాస్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న చేతన్ అనే విద్యార్థిని ఉపాధ్యాయుడు సతీష్ విచక్షణారహితంగా కొట్టాడు. ఒంటిపై గాయాలు చూసిన తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి యాజమాన్యంతో వాగ్వివాదానికి దిగారు. సదరు ఉపాధ్యాయుడిపై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

జీఎం కార్యాలయంలో అన్నదానం

రామవరం, అక్టోబర్ 16: సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. ఏరియా జీఎం శాలెంరాజు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఐటీయూసీ నుంచి మల్లికార్జున్‌రావు, ఐఎన్‌టీయూసీ నుంచి ఎండీ రజాక్, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు ఎంవీ నరసింహారావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి తొలగించడంతో గుండెపోటుతో వ్యక్తి మృతి

భద్రాచలం హరిత హోటల్ వద్ద మృతదేహంతో ధర్నా



భద్రాచలంలోని హరిత హోటల్ వద్ద మృతదేహంతో ధర్నా చేస్తున్న బాధితులు

భద్రాచలం, అక్టోబర్ 16 : విధుల నుంచి అకారణంగా తొలగించడంతో రోజువారీ వర్కర్ మనోవేదనకు గురై గుండె పోటుతో మృతిచెందాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలం పట్టణంలోని హరిత హోటల్‌లో ఇసంపల్లి నర్సింహారావు(40) పదేళ్లుగా రోజువారీగా వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతడిని హోటల్ మేనేజర్ విధుల నుంచి తొలగించడంతో తీవ్ర మనస్తాపం చెందడంతోపాటు మనోవేదనకు గురై గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో నర్సింహారావు కుటుంబ సభ్యులు, బంధువులు, దళిత సంఘాల నాయకులు అతడి మృతదేహాన్ని హోటల్ వద్దకు తీసుకొచ్చి ధర్నా చేపట్టారు. నర్సింహారావు మృతికి హోటల్ మేనేజరే కారణమని ఆరోపించారు. అతడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుడి భార్య ఈసంపల్లి లలిత తన భర్త మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దుమ్ముగూడెం, అక్టోబర్ 16: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన వికాస్‌కుమార్(27) ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణ పనుల కోసం వచ్చాడు. మండలంలోని సీతారాంపురం గ్రామంలో పనులు చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన కొంతమంది కూలీలు భద్రాచలంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. వికాస్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని తోటి కూలీలు కోరారు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమార్తె, 15 నెలల బాబు ఉన్నాడు.

సీతారామ ప్రాజెక్టు కాలువలో మొసలి సంచారం

బూర్గంపహాడ్, అక్టోబర్ 16: మండలంలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధి సీతారామ ప్రాజెక్టు కాలువలో మొసలి తిరుగుతుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. రైతులు, గ్రామస్తులు అటుగా వెళ్లొద్దని, పశువులు నీళ్లు తాగేందుకు అటుగా వెళతాయని అటు వెళ్లకుండా పశువుల కాపరులు, యజమానులు చూడాలన్నారు.

నాలుగు ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత

టేకులపల్లి, అక్టోబర్ 16: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మరం తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టుకున్న ఘటన మండలంలోని అందుగులగూడెం బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుంటల్ల పంచాయతీ ఆంజనపాల్లెం గ్రామ సమీపాన ఉన్న అందుగులగూడెం గుట్ట నుంచి అనుమతులు లేకుండా మరం తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఒక జేసీబిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఆర్ఐ రత్తయ్య, కానిస్టేబుల్ నాగేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం పట్టివేత

టేకులపల్లి, అక్టోబర్ 16: కిరాణా షాప్‌లో నాటుసారా తయారీకి వాడే బెల్లంను పట్టుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కొత్తగూడెం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం టేకులపల్లిలో అబ్కారీ జిల్లా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో కిరాణా షాపులో దాడులు నిర్వహించగా నాటు సారా తయారీకి వాడే 144 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్సై గౌతమ్, సిబ్బంది హబీబ్ పాషా, రామకృష్ణగౌడ్, గురవయ్య, రమేష్, శ్రావణి పాల్గొన్నారు.

అనారోగ్యంతో శంకరయ్య మృతి

దమ్మపేట, అక్టోబర్ 16: బీఆర్ఎస్ యువ నాయకుడు బండారుపల్లి ప్రసాద్ తండ్రి శంకరయ్య అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, మాజీ సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల కార్యదర్శి దొడ్డా రమేష్, దమ్మపేట మాజీ ఉపసర్పంచ్ దారా యుగంధర్ శంకరయ్య భౌతికకాయానికి సందర్శించి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపారు.